క్లుప్తంగా

ఏఎంసీ విభాగం విస్తరణకు చర్యలు



పూర్వ బ్లడ్ బ్యాంకును పరిశీలిస్తున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏఎంసీ విభాగాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన ఏఎంసీ విభాగం పక్కన ఉన్న పూర్వ బ్లడ్‌బ్యాంక్‌ను సందర్శించారు. ఈ బ్లడ్ బ్యాంక్ స్థానంలో అదనంగా ఏఎంసీ విభాగానికి పడకలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఉద్యోగులను ఆదేశించారు. ఏఎంసీ విస్తరణ వల్ల పడకల సంఖ్య పెరిగి అత్యవసర వైద్యం అందుకునే రోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాగే క్యాజువాలిటీపై భారం తగ్గుతుందని చెప్పారు. ఏఎంసీలో పడకలు లేక చాలా మంది రోగులు ఎక్కువ సమయం క్యాజువాలిటీలోనే ఉండాల్సి వస్తోందని, ఇకపై ఆ ఇబ్బందులు తప్పనున్నాయని ఆయన తెలిపారు.

భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత



భగవద్గీత గ్రంథాలతో కార్యకర్తలు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. స్థానిక ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన బజరంగ్‌దల్ శౌర్య ప్రశిక్షణ వర్గ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. హిందువుల ఐక్యతకు, ఆలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. అనంతరం వీహెచ్‌పీ నగర ఉపాధ్యక్షుడు శివపురం నాగరాజు తల్లి నాగరత్నమ్మ చే తుల మీదుగా సుమారు 200 మంది వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలకు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, కోకన్వీనర్ సందీప్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, నాయకులు శశికుమార్, పెంచల్‌రెడ్డి, రవికుమార్, పిచ్చయ్య చౌదరి, కమ్మయ్య, నీలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని వివిధ ఏరియాల్లో ఈ నెల 6వ తేదీన(గురువారం) లైన్‌ల నిర్వహణ, అభివృద్ధి పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓల్డ్‌టౌన్ సెక్షన్‌లో జొహరాపురం హౌసింగ్ కాలనీ, ఇండస్ట్రియల్ ఎస్టేటు సెక్షన్‌లో న్యూక్రిష్టానగర్, క్రిష్టానగర్, ఆదిత్య నగర్, విటల్‌నగర్, కల్లూరు, ఏస్టేట్ ఏరియా, బి.క్యాంపు సెక్షన్‌లో జొహరాపురం హౌసింగ్ బోర్డు, మణికంఠహోమ్స్, తేజశ్వినీనగర్, గణేషనగర్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం కాలనీ, జర్నలిస్ట్ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

కూటమి విజయంలో జనసేన కీలక పాత్ర

కర్నూలు(టౌన్): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంలో జనసేన పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకోవడంతో అభ్యర్థులకు ఘన విజయం చేకూరిందని చెప్పారు. బుధవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ గత మూడేళ్లుగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా పనిచేశారన్నారు. ఓటు వేసిన ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వెంకప్ప, మంజునాథ్, బజారి, సుధాకర్, సుమలత, పాల్గొన్నారు.

ఇంటి ముందు బాణాసంచా కాల్చొద్దన్నందుకు దాడి

కృష్ణగిరి: తొగర్చేడు గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇంటి ముందు బాణాసంచా కాల్చవద్దని చెప్పినందుకు దాడి చేసిన ఘటనపై గ్రామానికి చెందిన ఐదుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రోఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన బోయ సురేష్ తన బామర్ది కృష్ణకుమార్‌తో కలిసి పొలం నుంచి సాయంత్రం బైక్‌పై ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి ముందు బాణాసంచా కాల్చుతున్న బాల మద్ది, శివ, నాగరాజు, మధు, భాస్కర్‌నాయుడులను పక్కకు వెళ్లి కాల్చుకోమని చెప్పాడు. అందుకు నువ్వు ఎవడివిరా అంటూ అతనిపై దాడి చేశారు. ఇతన్ని విడిపించేందుకు ప్రయత్నించిన కృష్ణకుమార్, మహేష్‌లపై కూడా దాడి చేసి గాయపర్చారు. బాధితుడు సురేష్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కర్నూలు కల్చరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ పి.వి.రమణారెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీ శాఖ ఆధ్వర్యంలో నగరవనం, గ్రీన్ కో గని రిజర్వ్ ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ నెం. 117 లో వన సంరక్షణ సమితి సభ్యులు సుమారు 500 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌ఓ మాట్లాడుతూ మొక్కలు నాటి వాటి ని సంరక్షించుకోవాలన్నారు. ప్రకృతి సంపదను కాపాడుకోవాలన్నారు. సహజ వనరులను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, వనసంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ సీహెచ్ విజయ జ్యోతి కుమారి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బీ క్యాంపు హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమెతో పాటు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ గోవిందరెడ్డి, జీసీడీఓ సునీత, జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ రంగమ్మ పాల్గొని ప్రసంగించారు. ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ పొందుటకు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఇంటి పరిసరాల్లో మొక్కలను పెంచాలన్నారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు వక్తృత్వ, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సాయిరాం, ఏఎంఓ అల్లా బకాష్, రెడ్‌క్రాస్ జూనియర్ కో–ఆర్డినేటర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎఫ్ఆర్‌ఓ రమణారెడ్డి



విజేతలతో మైపర్ కాలేజీ ప్రిన్సిపాల్, సిబ్బంది



బీక్యాంపు హైస్కూల్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్ఎస్ఏ కో–ఆర్డినేటర్ విజయ జ్యోతి కుమారి

● మదర్ థెరిస్సా ఫార్మాసీ కాలేజీలో నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో ఆ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ పాల్గొని ప్రసంగించారు. పర్యావరణానికి హాని కలిగించే వస్తువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. అనంతరం కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ఆ తరువాత విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ డా.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.కె సురేష్, డీన్ ఆఫ్ అకాడమీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కౌతాళంలో కుండపోత వర్షం

కౌతాళం: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించింది. మంచాల్‌వీధి, వైఎస్సార్ కాలనీ, జేకేఎల్ఎస్ నగర్‌లో ఇళ్లలోకి నీరు చేరింది. గంటకు పైగా కురిసిన వానతో కౌతాళం గ్రామం తడిసి ముద్దయ్యింది. ఏ వీధి చూసినా నీటి ప్రవాహం కనిపించింది. గత వారం కురిసిన వర్షంతో కొంతమంది రైతులు పొలాల్లో విత్తనాలను నాటారు. ఇక బుధవారం భారీ వర్షం కురవడంతో మండలంలో విత్తు పనులు మొదలుపెట్టేందుకు అనువుగా మారిందని, భూమిలో తేమ శాతం పెరిగిందని రైతులు చెబుతున్నారు. గురువారం నుంచి విత్తు వేసే పనులను ప్రారంభిస్తామని చెప్పారు. మండలంలో రైతులు ప్రధానంగా పత్తి పంటను సాగు చేయనున్నారు.



నీట్‌లో మెరిశారు

● మెరుగైన మార్కులు సాధించిన జిల్లా విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో శ్రీచైతన్య కాలేజీల డీన్స్ సరళ, బాలాజీ



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఎస్ఆర్ విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జ్ రాజా రఘువీర్, తదితరులు



విద్యార్థుల అభినందన కార్యక్రమంలో నారాయణ కాలేజీల డీజీఎం గోవర్ధన్ రెడ్డి, తదితరులు

కర్నూలు సిటీ: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి ఎన్‌టీఏ గత నెల 5వ తేదీన నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఫలితాలు మంగళవారం అర్ధ రాత్రి విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించారు. ఇండస్, ఏ క్యాంపులోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం హైస్కూల్, మదర్ థెరిస్సా ఫార్మాసీ కాలేజీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ, శ్రీలక్ష్మి స్కూల్(సంసిద్ధ్), అథెనా స్కూల్‌లలో కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 4,838 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 106 మంది గైర్హాజరయ్యారు.

☛ నారాయణ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు నీట్ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ఆ విద్యా సంస్థలకు చెందిన డి.జి.ఎం. గోవర్ధన్ రెడ్డి, డీన్స్ ఆంజనేయరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఆ కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు పాల్గొని ప్రసంగించారు. టి.ఫణిధర్ రెడ్డి 700 మార్కులు, మహమ్మద్ ఇర్ఫాన్ 685 మార్కులు, జి.తేజస్ సాయి 672 మార్కులు, కె.తన్మయి 670 మార్కులు, జి.జీవన్‌కుమార్ రెడ్డి 661 మార్కులు, షేక్ మహమ్మద్ సైఫ్ రోషన్ 658 మార్కులు, కె.ఐశ్వర్య వర్మ 656 మార్కులు, ఎస్.భావికా రెడ్డి 653 మార్కులు, సుమయ 651 మార్కులు సాధించారన్నారు. 700 మార్కులు ఆపైన ఒక్కరు, 650 మార్కులకు పైగా 9 మంది, 600 మార్కులకుపైగా 32 మంది, 550 మార్కులకు పైగా 85 మంది, 500 మార్కులపైగా 124 మంది, 450 మార్కులకు పైగా 181 మంది, 400 మార్కుల పైన 242 మంది సాధించారన్నారు. అనంతరం అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను డీజీఎం, డీన్స్ సన్మానించారు. కార్యక్రమంలో కాలేజీ వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్ కె.హవీల, ప్రసాద్, టి.కౌసల్య, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

☛ నీట్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు ఆ కాలేజీల ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఆ కాలేజీలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కాలేజీలకు చెందిన విద్యార్థులు ఆల్ ఇండియా లెవెల్‌లో 720 మార్కులకుగాను, డి.దక్షిత 672 మార్కులు, జి.రఘువర్ధన్ రెడ్డి 665 మార్కులు, డి.దాక్షాయని 661, ఎ.హారికాబాయ్ 658 మార్కులు, సి.విష్ణువర్ధన్ 654, వి.హేమంత్ రెడ్డి 650, జి.సాయితేజ 650, జి.అరవింద్ ప్రసాద్ 645, ఎస్.కె.ఎం.డి. ఆఫన్ సులైఖ్ ఖాన్ 630, పి.ఇమాం ఖాసీంబీ 625, ఎస్.సుమయా తేహాసీన్ 621, పి.మైత్రీ రెడ్డి 612 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు మొత్తం 97 మంది తమ కాలేజీల విద్యార్థులకు మెడికల్ సీట్లు రానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆ కాలేజీలకు చెందిన డీన్స్ సరళ, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

☛ ఎస్ ఆర్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు నీట్ పరీక్షలో రాణించినట్లు ఆ విద్యా సంస్థలకు చెందిన జోనల్ ఇన్‌చార్జ్ టి.రఘువీర్ తెలిపారు. కురువ రమేష్ 630 మార్కులు, మల్లెల కీర్తి 626 మార్కులు, విజయానందు 620 మార్కులు, రామలక్ష్మి 593 మార్కులు, టి.రంజిత్‌కుమార్ 576, యం.తేజశ్వర్ 557, వి.హిందూ 552, ఖాజా మున్నా 529, చరణ్ తేజ్ 513, రాము 512, శ్రీలిఖిత 510 మార్కులు, వై.నిత్య 507, చరిత 500, ఎం.లక్ష్మణ్ 498, పి.పవన్ 478 మార్కులు సాధించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు నీట్‌లో మంచి మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ఆ విద్యా సంస్థలకు చెందిన అధినేత వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈఓ సురేందర్ రెడ్డి, జీఎం రాజేంద్ర ప్రసాద్, తదితరులు ఉన్నారు.

ప్రజలకు అండగా ఉంటా

● వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఇంతియాజ్

కర్నూలు (టౌన్): ‘ఎన్నికల ఫలితంతో సంబంధం లేకుండా నియోజకవర్గ ప్రజలకు అన్నివిధాలుగా అండగా ఉంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక నరసింగరావు పేటలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో 72 రోజులు తన వెంట ఉండి ప్రచారం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కర్నూలు ఎమ్మెల్యేగా ఎన్నికై న టీజీ భరత్‌కు అభినందనలు తెలిపారు. ఆశించిన ఫలితం రాలేదని నిరుత్సాహపడకుండా ప్రజలకు అండగా నిలబడి సేవ చేద్దామని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలో పారిశుద్ధ్యం మెరుగు, రహదారుల విస్తరణ, ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

పెద్దాసుపత్రి అభివృద్ధికి సహకరించాలి



ఏపీఎన్‌జీఓస్ నాయకులతో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఉద్యోగులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధికి సహకరించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఇటీవల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను బుధవారం తన చాంబర్‌లో ఏపీ ఎన్‌జీఓస్ నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా నాయకులతో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలోని పరిపాలనా విభాగంలో పనిచేసే ఉద్యోగులు తనకు ఎప్పటి నుంచో పరిచయస్తులన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని చెబుతున్నానన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత కార్యాలయంలో ఉండాల్సిన పనిలేదన్నారు. విధిగా సమయానికి వచ్చి చెప్పిన పనిచేసి వెళ్లాలని సూచించామన్నారు. తద్వారా రోగులకు అవసరమైన వసతులు, సౌకర్యాలు సకాలంలో అందించిన వారమవుతామన్నారు. ఏపీ ఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారితో మంచిగా పనిచేయించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉద్యోగులు ఎప్పుడూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటారన్నారు. తమ ఉద్యోగులందరూ ఎప్పుడూ అధికారులు చెప్పినట్లు వింటారని, అధికారులు సైతం వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓస్ జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్, అసోసియేట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, జిల్లా సహాయ కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, జనార్దన్‌రెడ్డి, సిటీ అధ్యక్షుడు కాశన్న, కార్యదర్శి రామకృష్ణ, చిరంజీవి, కుమారస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బయలు వీరభద్రస్వామికి విశేషార్చన



వీరభద్రస్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకుడైన బయలు వీరభద్రస్వామికి బుధవారం అమావాస్య ఘడియలు రావడంతో విశేషార్చన జరిపించారు. అచ్చివాస్య రోజున భక్తులు పరోక్షసేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం కల్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి 16 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా విశేషపూజను జరిపించుకున్నారు. ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపారు. అనంతరం పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం నిర్వహించారు. స్వామి ఆరాధన వలన గ్రహదోషాలు నివారించబడతాయని, అరిష్టాలన్నీ తొలగి పోతాయని, ఎంతటి క్లిష్ట సమస్యలైనా పరిష్కరించబడతాయని, ప్రమాదాలు నివారించబడతాయని, అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు పేర్కొంటున్నారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో బుధవారం కృత్రికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

హిందూ సంప్రదాయాలను అలవర్చుకోవాలి



భగవద్గీత సారాంశాన్ని బోధిస్తున్న మల్లు వెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ హిందూధర్మ సంప్రదాయాలను అలవర్చుకోవాలని తిరు మల తిరుపతి దేవస్థానం ఉమ్మడి కర్నూలు జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో హిందూ ధార్మిక అలవాట్లు, సంప్రదాయాలు ఆచరణీయమైనవాటిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి పిల్లలకు హిందూ ధార్మిక చింతన అలవడేలా చేయాలన్నారు. తద్వారా నైతికత, సంఘనీతి, స్నేహశీలత్వం వంటి సులక్షణాలు అలవడుతాయన్నారు. అనంతరం నాగేశ్వరరెడ్డి భగవద్గీత సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటరమనారెడ్డి, రవికుమార్, నాగేషయ్య, ఓంకారమాచారి, ఎస్.వెంకటరమణారెడ్డి, ఎస్.నాగిరెడ్డి, జి.పుల్లయ్యగౌడు, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాప్‌లో చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డులో రెడ్‌చిల్లీ రెస్టారెంట్ పక్కన ఉన్న కూల్‌డ్రింక్ షాప్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రెస్టారెంట్ మూసివేశారు. ఇదే అదునుగా భావించిన దొంగలు కూల్‌డ్రింక్ షాప్ వెనకవైపు రేకును కట్ చేసి చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఉదయం షాప్ తెరిచేందుకు వచ్చిన యజమాని తపాల్ ముఖీమ్ షాప్ వెనక భాగం కట్ చేసి ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. షాప్‌లోని రూ.10 వేలు విలువ చేసే కూల్‌డ్రింక్స్, సిగరెట్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పట్టణ పోలీసులు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సి.బెళగల్: సంగాల గ్రామంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. సంగాల గ్రామానికి చెందిన బైటిగేరి శేఖర్ ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

డోన్ రూరల్: పట్టణం సమీపాన 44వ జాతీయ రహదారిపై బుధవారం ఆర్‌టీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలోని తుముకూరుకు చెందిన ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుంచి వెళ్తుండగా తనిఖీ చేశారు. రోడ్ ట్యాక్స్ చెల్లించలేదని గుర్తించిన ఆర్‌టీఓ రూ.58,500 జరిమానా విధించారు.

రోగులు సంతృప్తి చెందేలా వైద్య సేవలు

● జిల్లా వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్



వృద్ధురాలికి మందులు అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్

ఓర్వకల్లు: ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు సంతృప్తి చెందేలా వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఓర్వకల్లు మండలం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కన్నమడకల సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగే ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది కార్యక్రమం నిర్వహించే ఒక్క రోజు ముందే ఆరోగ్య సేవలు అవసరమైన వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఓపీకి వచ్చే రోగులందరికీ అవసరమైన రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలన్నారు. మధ్యాహ్న సమయంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులకు వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు చేసి ఆ వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. అందులో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి మందులు, తగిన సూచనలు అందజేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలో జరిగిన టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ రిపోర్టులను పరిశీలించారు. ఏఎన్ఎంలు తమ పరిధిలోని గర్భిణులు, పిల్లలకు సకాలంలో వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. ప్రధానంగా ఎంఆర్–1, ఎంఆర్–2 వ్యాక్సిన్లు వంద శాతం పూర్తిచేసి, వాటి వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రేఖా, జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ ప్రసాద్, ఎంపీహెచ్‌ఓ రాబర్ట్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: గ్రామాల్లో వలసల నివారణలో భాగంగా అవసరమైన కూలీలందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఏపీఓ మోదీన్ బాషా ఆదేశించారు. బుధవారం మండలంలోని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ఈసీ వెంకటేష్‌తో కలిసి సమావేశమయ్యారు. ఉపాధి పనులపై చర్చించారు. కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో మండలంలోని చాలా గ్రామాల్లో ఉపాధి పనులు నిలిచిపోయాయని, వర్షాలు ఆగిపోయినందున తిరిగి ఆయా గ్రామాల్లోని కూలీలందరికీ పనులు కల్పించాలని ఏపీఓ సిబ్బందిని ఆదేశించారు. అలాగే పనుల్లోకి వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాలని, ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిదినాలు కచ్చితంగా కల్పించాలన్నారు. ఈ ఏడాది ఉపాధి పథకం కింద 400 ఎకరాల్లో చిన్న, సన్న కారు రైతుల పొలాల్లో పండ్లతోటలు సాగు చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, ఇప్పటి వరకు కేవలం 100 ఎకరాల్లో మాత్రమే పండ్ల తోటలను సాగు చేయించామని, వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఏపీఓ సిబ్బందికి సూచించారు.

చిన్నారులకు టీకాలు



చిన్నారులకు రోగ నిరోధక టీకాలు వేస్తున్న ఏఎన్ఎం

సి.బెళగల్: మండల కేంద్రంలో బుధవారం 18 మంది చిన్నారులకు రోగ నిరోధక టీకాలు వేసినట్లు ఏఎన్ఎం పుష్పలత తెలిపారు. ఇందులో 11 మంది బాలురు, ఏడుగురు బాలికలకు పోలియో, న్యుమోనియా, తట్టు, మెదడువాపు తదితర వ్యాధుల నివారణకు టీకాలు వేసినట్లు తెలిపారు. సకాలంలో పిల్లలకు టీకాలు వేయించాలని తల్లులకు సూచించారు. ఆశా వర్కర్లు రాజకుమారి, ఉషారాణి, హుసేన్‌బీ, శేషమ్మ, మార్తమ్మ తదితరులు ఉన్నారు.